సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023

ఇసుక రీచ్‌ల పరిశీలన

కోటపల్లి: మండలంలోని కొల్లూర్, పార్‌పల్లి, ఎర్రాయిపేట, పలుగుల ఇసుక రీచ్‌లను తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ జి.ప్రశాంతి గురువారం పరిశీలించారు. ఇసుక రీచ్‌లో లోడింగ్, ధర్మకాంటల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట టీఎస్‌ఎండీసీ జిల్లా ప్రాజెక్టు అధికారి తారక్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో ఖాళీలను తాత్కాలిక పద్ధతిన భర్తీ చేయడానికి నిర్వహించిన పరీక్షలు రాసిన అభ్యర్థులకు ఈ నెల 11న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని డీఈవో యాదయ్య తెలిపారు. పీజీసీఆర్టీ, సీఆర్టీ, పీఈటీలకు పరీక్షలు రాసిన అభ్యర్థులకు 1:3 నిష్పత్తిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, అభ్యర్థులు డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

ఆకాశం ఉదయం వేళ పాక్షికంగా, రాత్రివేళ పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రతీ పౌరుడు దేశభక్తిని చాటాలి



జెండాను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే దివాకర్

పాతమంచిర్యాల: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతీ పౌరుడు ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు అన్నారు. జిల్లాలోని పోస్టాఫీసులకు సరఫరా చేసిన జెండాలను గురువారం జిల్లా కేంద్రంలో ప్రదర్శించారు. జిల్లా పోస్టల్ అధికారి రామారావు మాట్లాడుతూ కుమురంభీం, మంచిర్యాల జిల్లాలకు ప్రభుత్వం 14 వేల జాతీయ జెండాలు సరఫరా చేసిందని, జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని పోస్టాఫీస్‌ల్లో జాతీయ జెండాను రూ.25కు విక్రయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌పోస్టాఫీస్ పోస్ట్ మాస్టర్ సంజయ్, పోస్టల్ అధికారి శ్రావణి పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధి నిర్మూలనకు కృషి



మాత్ర వేసుకుంటున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: జిల్లాలో బోదకాలు వ్యాధి పూర్తి నిర్మూలనకు అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు, జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్, మలేరియా సహాయ సంచాలకులు నాగయ్య, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనితతో కలిసి బోదకాలు నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బోదకాలు నివారణ మాత్రలను ఉద్యోగులకు అందించి తానూ తీసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7.72లక్షల మందికి అందించేందుకు మాత్రలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పర్యవేక్షకులు విశ్వేశ్వర్‌రెడ్డి, ఉప వైద్యాధికారి డాక్టర్ విజయ నిర్మల, ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ ఫయాజ్, జిల్లా మాస్‌మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, అధికారులు నాందేవ్, సత్యనారాయణ, అల్లాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

నస్పూర్: జిల్లాలోని ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, ఆశావర్కర్ల జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క డిమాండ్ చేశారు. ఆశావర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశావర్కర్లు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్, సమ్మక్క మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఆశాలను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోమాస ప్రకాశ్, దూలం శ్రీనివాస్, దాగం రాజారాం, శోభ, కమిత, పద్మ, రాజేశ్వరి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో వందేభారత్ ఆపాలి



కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎంపీ వివేక్

మంచిర్యాలటౌన్: త్వరలో ప్రారంభమయ్యే నాగ్‌పూర్-సికింద్రాబాద్ వందేభారత్ రైలుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి గురువారం ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేశారు. నిత్యం వేలాది మంది మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి రైల్లో రాకపోకలు కొనసాగిస్తున్నారని, వారికి వందేభారత్ రైలు ద్వారా మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

తగ్గితే తప్పేంటి..?

- భార్యాభర్తల మధ్య మనస్పర్థలు
- సర్దుకుపోకుండా భూతద్దంలో చూస్తున్న వైనం
- విడిపోవడానికే ఆసక్తి
- కోర్టులను ఆశ్రయిస్తున్న దంపతులు



మంచిర్యాలక్రైం: జీవితాంతం ఒకరికొకరు తోడుంటామని ఏడడుగులు వేసిన భార్యాభర్తలు చిన్న చిన్న గొడవలకే కోర్టు గడప తొక్కుతున్నారు. సర్దుకుపోతే ఏ సమస్యా ఉండదని తెలిసినా సమస్యలను భూతద్దంలో చూసుకుంటూ విడాకుల వరకూ వెళ్తున్నారు. ఆలుమగల మధ్య ఏర్పడిన సమస్యను పరిష్కరించాల్సిన ఇరు కుటుంబాల పెద్దలు సైతం పంచాయితీకి ఆజ్యం పోస్తున్నారు. దీంతో దంపతుల మధ్య ఎడబాటు పెరిగి పంతాలకు వెళ్తున్నారు. చివరికి పోలీసుస్టేషన్లు, కోర్టు మెట్లెక్కడం వంటి కేసులు జిల్లాలో పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

అహం వల్లే

ఆధునిక కాలంలో ఏడడుగులు నడిచి ఏడాది గడవకముందే ఎన్నో జంటలు మనస్పర్థలతో విడిపోతున్నాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఒకరు తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడం, మరొకరు తల్లిదండ్రులను సరిగా చూసుకోవడం లేదని ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని సమస్యలూ చిన్నవే. కానీ భూతద్దంలో చూసుకుంటూ బజారున పడుతున్నారు. ఫలితంగా జిల్లాలో భార్యాభర్తల గొడవలకు సంబంధించిన కేసులు ఏడాదికేడాది పెరిగిపోతున్నాయి. కొన్నింటిలో పోలీసుల కౌన్సెలింగ్‌తో పరిష్కారం కనిపిస్తున్నా మరికొన్ని ఘటనల్లో మొండిగా వ్యవహరిస్తూ కేసుల వరకు వెళ్తున్నారు. చేసేదేమీ లేక పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నారు. పోలీసుస్టేషన్‌లో అయినా.. కోర్టులో అయినా సరే సర్దుకుపోదామనే ఆలోచనకు రావడం లేదు. చాలా కేసుల్లో భార్యాభర్తలే కాకుండా వారి తల్లిదండ్రుల అహం కూడా విడాకులకు కారణమవుతోంది. ఇద్దరికి సర్ది చెప్పాల్సిన పెద్దలు విడిపోయే పరిస్థితి తీసుకొస్తున్నారు.

సామరస్యంగా మాట్లాడుకుంటే..

దంపతులు మొండి ధోరణి విడనాడి ఏ సమస్య తలెత్తినా ఎవరో ఒకరు తగ్గి సామరస్యంగా మాట్లాడుకోవాలి. ఎదుటివారిపై ఆధిపత్యానికి ప్రయత్నించవద్దు. జీతాలు, హోదాలు ఎలా ఉన్నా అన్నీ తమ కుటుంబం కోసమే అన్న భావన పెంచుకోవాలి. తగాదాలు వస్తే సాధ్యమైనంత వరకు మూడో మనిషి(తల్లిదండ్రులకు సైతం)కి తెలియకుండా ఎవరి పాత్ర ఎంత అనే ఆత్మ విమర్శ చేసుకుంటే పరిష్కారం లభిస్తుంది. తప్పెవరిదో తెలిసినప్పుడు క్షమాపణ కోరితే పోయేదేమీ లేదు. ఈ ఒక్క చిన్న మాట ఎంతో మార్పుకు కారణమవుతుంది. భార్యాభర్తల మధ్య వివాదాలు, వాటి పర్యవసానాలు పిల్లలపై ప్రభావం చూపుతాయి. ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలి. సాధ్యమైనంత వరకు పిల్లల ముందు గొడవ పడకుండా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. ప్రతీ కుటుంబానికి సంపాదన ఎంత అవసరమో సంతోషం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గ్రహించాలి.

మచ్చుకు కొన్ని సంఘటనలు...

శ్రీరాంపూర్‌కు చెందిన యువతికి గోదావరిఖనికి చెందిన ఓ సింగరేణి ఉద్యోగం చేస్తున్న యువకుడితో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు తండ్రిదే సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు. వివాహమైన కొద్ది కాలానికే అత్తాకోడళ్ల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. పంచాయితీ తెగకపోవడంతో ఇరు కుటుంబాలు పోలీస్‌స్టేషన్ మెట్లెక్కాల్సి వచ్చింది. అసలు గొడవ ఎక్కడంటే కోడలు ఉదయం లేవడం లేదని, ఇంటి పని చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని అత్తాకోడళ్ల మధ్య గొడవ పోలీస్‌స్టేషన్ వరకు నడిపించింది.

వివాహేతర సంబంధం..

సీసీసీ నస్పూర్‌కు చెందిన మహిళ దండేపల్లికి మండలానికి చెందిన వ్యక్తి ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంత కాలం తర్వాత ఇరు కుటుంబాలు దగ్గరయ్యారు. కొంత కాలానికి అతడు మరో మహిళతో వివాహేతర సంబంధం సాగిస్తూ భార్యను సరిగా చూసుకోలేదు. విషయం తెలుసుకున్న భార్య నిలదీయడంతో భర్త కుటుంబ సభ్యులు అతడికే వత్తాసు పలకడంతో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించినా మార్పు రాకపోవడంతో ఆమె కోర్టు మెట్లెక్కాల్సి వచ్చింది.

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మహిళా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులు..

పిటిషన్లు	ఎఫ్ఐఆర్	కాంప్రమైజ్	పెండింగ్
201	43	155	03

అవగాహన లోపమే కారణం..



పెళ్లయిన తర్వాత ఇద్దరికీ రకరకాల కోరికలు ఉంటాయి. నేటి తరం కలిసి ఉండడానికి కావాల్సిన నైపుణ్యాలు తగ్గిపోవడమే వివాదాలకు కారణమవుతోంది. చిన్న చిన్న విషయాలను పెద్దగా చేయడం ద్వారా కాపురాలు కూలిపోతున్నాయి. ఎవరూ సర్దుకుపోవడానికి ప్రయత్నించడం లేదు. పిల్లలకు సర్దిచెప్పాల్సిన బాధ్యత ఇరు కుటుంబాల పెద్దలపై ఉంటుంది. భార్య భర్తను, భర్త భార్యను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే సమస్యలే ఉండవు.

– డాక్టర్ విశ్వేశ్వర్‌రావ్,
మానసిక వైద్యనిపుణులు, మంచిర్యాల

పంతాలకు పోవడం వల్లే...



చాలా కేసుల్లో భార్యాభర్తలు పంతాలకు పోవడం వల్లే కాపురాలు కూల్చుకుంటున్నారు. ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తినప్పుడు కొంత కూల్‌గా ఆలోచిస్తే సమస్యకు అక్కడే పరిష్కారం లభిస్తుంది. కానీ ఇరువురి కుటుంబాలు ఎక్కడా తగ్గడం లేదు. దీంతో సమస్య మరింత పెద్దదిగా మారుతోంది. పిల్ల ల జీవితం ముఖ్యమంటూనే తల్లిదండ్రులు పంతాలకు పోతుండడంతో వివాదాలు విడాకుల వరకూ పోతున్నాయి. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని అభిప్రాయాలను గౌరవించుకోవడం ద్వారా ఆనందంగా జీవించవచ్చు.

– పులి రాజమల్లు,
పబ్లిక్ ప్రాసిక్యూటర్, మంచిర్యాల

అదే వరుస

- గృహలక్ష్మి దరఖాస్తుకు బారులు
- గడువు తేదీపై అయోమయం



నెన్నెలలో బారులు తీరిన దరఖాస్తుదారులు

దండేపల్లి/భీమిని/జైపూర్/నెన్నెల/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుకు ప్రజలు ఆయా మండలాల్లో బారులు తీరారు. గురువారం గడువు ముగుస్తుందని లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయాల వద్ద భారీ సంఖ్యలో వరుస కట్టారు. సొంతింటి కల సాకారం కోసం భారీ యెత్తున దరఖాస్తులు చేసుకున్నారు. దండేపల్లి మండలంలో ఈ నెల 10 నుంచి 10 వరకు మొత్తం 2,887 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. కన్నెపల్లి మండలంలో 2,758, భీమినిలో 2,100 దరఖాస్తులు వచ్చాయి. జైపూర్ మండలంలో 2,176 మంది దరఖాస్తు చేసుకున్నారు. నెన్నెల మండలంలో 4,500 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. లబ్ధిదారులతో జిరాక్స్ సెంటర్లు కిక్కిరిసి పోయాయి. హాజీపూర్ మండలంలో 1,819 దరఖాస్తులు వచ్చినట్లు నాయబ్ తహసీల్దార్ హరిత తెలిపారు.

జన్నారం: మండల కేంద్రంలోని ఆన్‌లైన్ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లు కిటకిటలాడాయి. ప్రభుత్వ నిబంధనలు పూర్తి స్థాయిలో తెలియక, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆన్‌లైన్ కేంద్రాలకు పరుగులు తీశారు. మండలంలో 1,510 మంది దరఖాస్తు లు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో గురువారం ఒక్కరోజే 1,548 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో దరఖాస్తుదారుల సంఖ్య 2,370కు చేరిందని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా వీఆర్‌ఏలు

- నేడు కలెక్టర్ చేతుల మీదుగా నియామక లేఖలు
- జిల్లాలో 482 మంది.. శాఖల వారీగా కేటాయింపు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ) వ్యవస్థ పూర్తిగా రద్దయింది. జిల్లాలోని వీఆర్‌ఏలను ఇతర ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తూ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోతీలాల్ ఆధ్వర్యంలో జాబితా సిద్ధమైంది. రెవెన్యూ శాఖతోపాటు మొత్తం 11శాఖలకు కేటాయించారు. జిల్లాలోని 482మంది వీఆర్‌ఏలతోపాటు పెద్దపల్లి జిల్లా నుంచి మరో 17మంది బదిలీ రానున్నారు. వీరందరికీ ఈ నెల 11న శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్లు మోతీలాల్, రాహుల్, ప్రభుత్వ విప్ బాల్కసుమన్, ఎమ్మెల్యేలు ఎన్.దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య నియామక పత్రాలు అందజేయనున్నారు. ఆయా శాఖల ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడికక్కడే నియామక లేఖలు అందుకోవడంతోపాటు ఉద్యోగాల్లో చేరేలా ఏర్పాట్లు చేశారు.

సర్దుబాటు ఇలా..

జిల్లాలో 541 మంది వీఆర్‌ఏలు ఉండగా 61ఏళ్లలోపు వారు 482 మంది ఉన్నారు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా 75మంది, రికార్డు అసిస్టెంట్‌గా 61, సబార్డినేట్‌గా 12, మున్సిపల్ శాఖలో వార్డు అధికారులు(జూనియర్ అసిస్టెంట్)గా 47, ఇరిగేషన్ శాఖలో లష్కర్ పోస్టులకు 83, సహాయకుల పోస్టులు 8, మిషన్ భగీరథలో సహాయకులు 96మందిని సర్దుబాటు చేస్తున్నారు. జిల్లా నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ముగ్గురిని, జగిత్యాల జిల్లాకు 39మందిని కేటాయించారు. 61ఏళ్లు దాటిన 59మంది స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆదేశాలు రాకపోవడంతో పెండింగ్‌లో ఉంచారు.

ఏడుగురు జేపీఎస్‌లకు..

జేపీఎస్‌ల పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరణకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ సాగుతోంది. జిల్లాలో 218మందికి గాను 115మంది ప్రొబేషనరీ కాలం పూర్తి కాగా మరో 103మందికి సంబంధించి మరో మూడు నెలల్లో ముగియనుంది. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వివిధ అంశాల వారీగా వంద మార్కులతో కూడిన నివేదిక ఆధారంగా పనితీరును పరిశీలించి 70మార్కులు వచ్చిన వారిని అప్రూవల్ చేస్తోంది. 70మార్కులు రాని వారికి మరో ఆరు నెలలు అవకాశం ఇస్తోంది. ఇప్పటివరకు 115మందిలో దాదాపు 25మందికి పైగా జేపీఎస్‌ల పనితీరు పరిశీలించారు. ఇందులో ఏడుగురికి మాత్రమే 70కి పైగా మార్కులు రాగా శుక్రవారం కలెక్టరేట్‌లో నియామక లేఖలు అందించనున్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం(ఫైల్)

స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- వేడుకల నిర్వహణపై సమీక్ష

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 15న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్ సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి జిల్లా శాఖల అధికారులతో వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాలలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని అన్నారు. వివిధ శాఖల సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో ప్రగతిని తెలియజేసేలా శకటాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

వ్యవసాయ గణన కీలకం

మంచిర్యాలఅగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ గణన కీలకమైందని కలెక్టర్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య ప్రణాళిక అధికారి సత్యం, జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విధానంలో వివరాలు సేకరించి యాప్ ద్వారా గణన చేయడం వల్ల కచ్చితమైన సమాచారం నమోదు అవుతుందని, ఈ నెల 20లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని గణన చేయడంతోపాటు ప్రభుత్వ ప్రణాళిక రూపకల్పన ఆవశ్యకతపై రాష్ట్ర అర్థగణాంక శాఖ ఉప సంచాలకుల పి.రవీందర్‌రెడ్డి, జిల్లా ఉప గణాంక అధికారి అశోక్‌రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉప గణాంక అధికారులు, మండల ప్రణాళిక, గణాంక అధికారులు, వ్యవసాయ, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బాదవత్ సంతోష్

'బీఆర్‌ఎస్‌తోనే ప్రజల జీవితాల్లో వెలుగులు'

బెల్లంపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తున్నాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో బీసీ కులస్తులు, చేతివృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం లబ్ధిదారులకు చెక్కులను కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వినోద్‌కుమార్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కమిషనర్ కె.సమ్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

తిరంగా జెండాల పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో తపాలా శాఖ ఉద్యోగులు తిరంగా జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం బెల్లంపల్లి సబ్ డివిజన్ ఆధ్వర్యంలో పోస్టాఫీసు నుంచి బజారు ఏరియా, కాంటా చౌరస్తా, ఏఎంసీ ఏరియా మీదుగా పుర వీధుల్లో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆర్డీవో కార్యాలయంలో డీఏఓ మధుసూదన్‌కు జాతీయ జెండాను అందజేశారు. పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రామారావు, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు


పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పాఠశాలల స్వీపర్లకు కనీస వేతనం చెల్లించాలని, ఎస్సీ హాస్టళ్లలో క్యాటరింగ్ విధానం రద్దు చేయాలని గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు అంగన్‌వాడీ ఉద్యోగులు, స్కూల్ స్వీపర్లు వినతిపత్రం సమర్పించారు. అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షురాలు భానుమతి, పాఠశాలల స్వీపర్ల యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హాస్టల్ వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వీఆర్‌వోల సమస్యలు..

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఇతర డిపార్ట్‌మెంట్లకు కేటాయించిన వీఆర్‌వోలు ఎదుర్కొంటున్న క్యాడర్ స్ట్రెంత్, సీనియారిటీ, ప్రమోషన్ తదితర సమస్యలపై గురువారం టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు బాపు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం దశలవారీ ఆందోళనలో భాగంగా తపస్ ఆధ్వర్యంలో స్థానిక ఐబీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో పారిశుధ్య కార్మికులను నియమించాలని, ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని, బకాయిలను ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, సీపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని తెలిపారు. అనంతరం పట్టణంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్, జిల్లా బాధ్యులు నీలేష్‌కుమార్



మాట్లాడుతున్న బండి రమేష్

కాంగ్రెస్ పార్టీ సంఘీభావం

ఉపాధ్యాయుల ధర్నాకు కాంగ్రెస్ పార్టీ సంఘీభావం ప్రకటించింది. సమస్యలు పరిష్కరించాలని డీసీసీ జిల్లా అధ్యక్షురాలు సురేఖ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కొండ చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానేష్, పట్టణ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఈ నెల 12, 13న నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు మంచిర్యాలలోని రంగపేట గ్రీన్ సిటీలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తామని, క్రీడాకారులు ఆగస్టు 12న ఉదయం 10 గంటలలోపు అకాడమీలో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8978753944, 9959977929, నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రూ.34.16 లక్షలు రైల్వే టికెట్ డబ్బులు స్వాహా

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లోని టికెట్ కౌంటర్‌లో వచ్చిన రూ.34.16లక్షల ఆదాయాన్ని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి స్వాహా చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. రైల్వేస్టేషన్‌లోని క్యాష్ మేనేజ్‌మెంట్ సిస్టం(సీఎంఎస్)లో బడే శ్రీపతిబాబు క్యాష్ రికవరీ ఏజెంట్‌గా ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం చేస్తున్నాడు. రైల్వే టికెట్ల విక్రయం ద్వారా వచ్చే ఆదాయాన్ని రోజువారీగా సంబంధిత బ్యాంకు ఖాతాకు జమ చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి జూలై 20వరకు రూ.34,16,300 ఆదాయం వచ్చినట్లు రైల్వే అధికారులు లెక్కలు తేల్చారు. ఆ డబ్బులు ఖాతాలో జమ కాలేదని నిర్ధారించారు. కొన్ని నెలల నుంచి డబ్బులు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన సీఎంఎస్ ఇన్ఫోసిస్ సిస్టం ప్రైవేటు లిమిటెడ్ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ ఆరా తీశాడు. శ్రీపతిబాబును విచారించి డబ్బులు స్వాహా అయినట్లు ధ్రువీకరించుకున్నారు. ఈ నెల 3న రహస్యంగా విచారణ చేయగా డబ్బులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. దీంతో గురువారం బెల్లంపల్లి టూటౌన్‌లో శ్రీపతిబాబుపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు శ్రీపతిబాబును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకోవాలని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. జాతీయ కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపు మేరకు సీపీఐ, సీపీఐఎంఎల్, సీపీఎం నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవో అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తోకల తిరుపతి, నాయకులు మేకల రాములు, ఏఐటీయూసీ నాయకులు ముస్కె సమ్మయ్య, మిట్టపల్లి పౌలు, సరస్వతి, రవీందర్, సీఐటీయూ నాయకులు ప్రకాష్, భాగ్యరాజ్, దూలం శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం, మల్లయ్య, నర్సయ్య, దేవయ్య, రాజేశం పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సంఘాల నాయకులు

క్లుప్తంగా

టమాటా వ్యాన్ బోల్తా



బోల్తా పడిన టమాటా వ్యాన్

ఆసిఫాబాద్‌రూరల్: బెంగళూర్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు టమాటా లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ గురువారం బూర్గుడ సమీపంలో బోల్తా పడింది. యూటర్న్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. బైక్‌పై వస్తున్న బాపు, అతని భార్య సోని కిందపడడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని ఒకరు బలవన్మరణం

లక్సెట్టిపేట(మంచిర్యాల): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. రెండవ ఎస్సై రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. లక్సెట్టిపేటకు చెందిన వరప్రసాద్ (40) ఏపని చేయకుండా ఖాళీగా తిరుగుతుండేవాడు. దీంతో ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో అతని భార్య మంచిర్యాలలోని పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తల్లి శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు స్వాధీనం

సిర్పూర్(టి): మండలంలోని టోంకినిలో గురువారం అక్రమంగా నిల్వ ఉంచిన దేశీదారు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన చౌదరి భరత్ మహారాష్ట్ర నుండి మద్యం తీసుకుని వచ్చి విక్రయిస్తున్నాడని తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా రూ.6వేల విలువైన 120 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్

మంచిర్యాలటౌన్: తెలంగాణ ప్రభుత్వం, ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 2023–24కు గాను మంచిర్యాల జిల్లా నుంచి 17 అంశాలలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, గ్రీక్ రోమన్, బెస్ట్ ఫిజిక్‌లో పాల్గొనేందుకు ప్రభుత్వ అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం, ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్ మంచిర్యాలలో ఈ నెల 16న జరిగే జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440141328 నంబరులో సంప్రదించాలన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని దేవులవాడ గ్రామానికి చెందిన బెల్లంపల్లి స్వప్న పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్సులో చెన్నూర్‌కు తీసుకువస్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ షాబాజ్, పైలెట్ ముజమిల్ ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రసవం చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది.

జాగ్రత్తలతో పంటలు ప్రాణాలు సురక్షితం

- పురుగు మందులతో పొంచి ఉన్న ప్రమాదం
- పిచికారీ చేసేటప్పుడు రక్షణ చర్యలు పాటించాలి
- వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్



రసాయనిక మందు పిచికారీ చేస్తున్న రైతు

మంచిర్యాలఅగ్రికల్చర్: తొలకరి వర్షాలకు విత్తుకున్న పంటలు ప్రస్తుతం ఎదిగే దశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి, సోయా, కంది పంటలను తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు కలుపు నివారణ, పురుగుల వ్యాప్తిని నివారించేందుకు చర్యలు చేపడుతున్నారు. పురుగు మందులు అంటేనే ప్రమాదకరంగా ఉంటాయి. అవి మన శరీరంలోకి వెళ్లినా.. గాలి ద్వారా పీల్చినా ఆరోగ్యానికి హానికరమే. పిచికారీ చేయడంలో అవగాహన లేకపోవడం.. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల రైతులు, వ్యవసాయ కూలీలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గతేడాది ఉమ్మడి జిల్లాలో పంటకు పురుగుల మందు పిచికారీ చేసి ఇంటికి వచ్చి విషప్రభావంతో ఏడుగురు మృతి చెందగా మరో 25 మంది అస్వస్థతకు గురయ్యారు. అనేక మంది అనారోగ్యానికి గురయ్యారు. ఇలాంటి ఘటనలు ప్రతీ సీజన్‌లో చోటు చేసుకుంటూనే ఉన్నాయి. పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రక్షణ చర్యలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ సూచిస్తున్నారు.

పరిమితికి మించి వాడరాదు

పంటను ఆశించిన తెగుళ్లు, పురుగుల నిర్మూలనకు పరిమితికి మించి మందులను వాడడం వలన మేలుకన్నా కీడే ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తలు పెస్టిసైడ్స్ దుకాణాదారుల సూచనలు పాటించాలి. జాగ్రత్త వహించకుంటే పంటకు మేలు చేసే సాలీడు, అక్షింతల పురుగులు మృత్యువాత పడుతాయి. మిత్ర పురుగులు పొలంలో లేకుంటే పంటకు కీడుచేసే పురుగుల ఉధృతి పెరుగుతుంది.

మందు ప్రభావానికి గురైతే..

- పురుగుల మందు ప్రభావానికి గురైతే వెంటనే సదరు వ్యక్తి నోట్లో వేలుపెట్టి వాంతి చేయించాలి.
- మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య గుడ్డ ఉంచాలి.
- శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి. ఉష్ణోగ్రత తగ్గితే దుప్పటి కప్పి వెచ్చగా ఉంచాలి.
- సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి. అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలు వైద్యునికి తెలపాలి.

అవగాహన అవసరం..

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగు మందులపై రైతులు అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా దుకాణాల్లో పురుగు మందులు నాలుగు రంగుల్లో లభ్యమవుతాయి. వీటిలో పుర్రె గుర్తుతో ఉన్న రంగు, ఆకుపచ్చ, నీలి, పసుపు రంగులతో కూడిన డబ్బాలుంటాయి. పుర్రె గుర్తుతో కూడిన ఎర్ర రంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నంతో తక్కువ విషపూరితం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- రసాయన మందు డబ్బా మూతను నోటితో తీయవద్దు. మందు ద్రావణాన్ని చేతితో కలపవద్దు.
- మందును ఒకేసారి కలుపుకోవాలి.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయరాదు. పిచికారీ సన్నగా తుంపరలా ఉండేలా చూడాలి.
- తగిన మోతాదులోనే మందు పిచికారీ చేయాలి. ఎక్కువైతే పంటలకు ప్రమాదం.
- ఒకేసారి రెండు లేదా మూడు మందులు కలిపి పిచికారీ చేయకూడదు.
- చేతులకు గ్లౌజులు, కళ్లజోడు, ముఖానికి మాస్క్ తలకు టోపీ, లేదా రుమాలు తప్పనిసరిగా ధరించాలి. చేతి వేళ్లకు గోళ్లు పెంచుకోకూడదు. పత్తిలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి.
- గాలికి ఎదురుగా పిచికారీ చేయకూడదు.
- పొగతాగడం తినడం, చేతులు నోట్లో పెట్టుకోవడం, కళ్లు నలుముకోవడం వంటి పనులు చేయవద్దు.
- పంట పెద్దగా ఉన్నప్పుడు చేతి పంపుతో కాకుండా స్ప్రేయర్‌తోనే పిచికారీ చేయాలి.
- కొన్ని మందులను మాత్రం పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయకూడదు.

అవి గాలిలో కలిసి ఇతర పంటలపై పడితే పంట నాశనమై పోతుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి.

- గాయాలైన చేతులతో మందు పిచికారీ చేయరాదు. పిచికారీ పూర్తయిన వెంటనే కాళ్లు, చేతులు సబ్బుతో కడుక్కోవాలి. తలస్నానం చేయాలి.
- ప్రత్యేకమైన దుస్తులను మాత్రమే వినియోగించాలి. వాటిని మిగతా దుస్తులతో కలిసి ఉతకొద్దు.
- చిన్నపిల్లలకు పురుగు మందులను సాధ్యమైనంత దూరంగా ఉంచాలి.
- పిచికారీ అనంతరం మందు డబ్బాలను గోతి తీసి పాతిపెట్టాలి.

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన భీంరావు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని దేవాపూర్ గ్రామానికి చెందిన ఎస్.భీంరావు ఈ నెల 11 నుంచి 14 వరకు తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌లో నిర్వహించనున్న సౌత్‌జోన్ మెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. జూన్‌లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చడంతో సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. భీంరావును ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు భాస్కర్లవాసు, బండ మీనారెడ్డి, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేశ్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

13న జిల్లా ఫుట్‌బాల్ సెలెక్షన్స్

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో ఈ నెల 13న జిల్లాస్థాయి మెన్ ఫుట్‌బాల్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని కోరారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుండి 23 వరకు వనపర్తి జిల్లా పెబ్బేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంజనీరింగ్‌లో మిగిలిన సీట్లకు కౌన్సెలింగ్

నస్పూర్(మంచిర్యాల): మంథని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (సూపర్ న్యూమరి)లో మిగిలిన సీట్లకోసం ఈ నెల 14న చివరిదశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ డీజీఎం అరవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల పిల్లలకు 14 సీట్లు, ఉద్యోగుల పిల్లలకు 12 సీట్లు ఉన్నాయన్నారు. 14న ఉదయం పది గంటలకు జేఎన్టీయూలో నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఉద్యోగి ఐడెంటిటీ కార్డు వెంట తీసుకువెళ్లాలని సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బెల్లంపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ విమర్శించారు. గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయన్నారు. రూ.5,500 కోట్ల బకాయిలు ఉన్నా సీఎం కేసీఆర్ స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ కళాశాలలకు ప్రహరీలులేక ఆకతాయిలకు అడ్డాలుగా మారుతున్నాయన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసీస్, రాజేశ్, బిట్టు, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

‘గుర్తింపు’ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

మందమర్రిరూరల్: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల కాలపరిమితి ముగిసి మూడేళ్లు కావస్తున్నా ప్రభుత్వం పలు సాకులు చెప్పి వాయిదా వేస్తోందన్నారు. ఎన్నికలు నిర్వహించేంత వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, వచ్చే నెల వేతనాలతో సింగరేణి లాభాల వాటా ఉద్యోగులకు పంపిణీ చేయాలని, సీఎస్ఆర్ నిధులపై యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రమేశ్, ప్రదీప్‌కుమార్, రవీందర్, వీరన్న, రజినీకాంత్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట(బెల్లంపల్లి): సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ మాత్రమేనని బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ పేర్కొన్నారు. గురువారం కాసిపేట 2 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో గోదావరిఖనిలో జరుగనున్న 16వ కేంద్ర మహాసభల్లో భవిష్యత్ ఉద్యమాలకు తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ నుంచి హెడ్ ఓవర్‌మెన్ మొయినొద్దీన్, 53 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి



ఐకే 1ఏ గనిపై మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

జైపూర్(చెన్నూర్): ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల పక్షపాతి అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కార్మికుల కలలు సాకారం అవుతున్నాయని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గని, ఐకే–ఓసీపీపై గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కారుణ్య నియామకాల ద్వారా 15 వేల మందికి ఉద్యోగాలు, కార్మికుల సొంతింటి నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం, కార్మికుల క్వార్టర్లకు ఏసీ సౌకర్యం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, రూ.700 కోట్ల లాభాలను కార్మికులకు పంచబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, జగదీశ్వర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రమేశ్, గద్దం మల్లన్న, రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ రికార్డులు పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న చిరంజీవి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి జీఎం కార్యాలయంలో సింగరేణి ఉద్యోగుల సీఎంపీఎఫ్ రికార్డులను గురువారం సీఎంపీఎఫ్ ఇన్స్‌పెక్టర్ పి.చిరంజీవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సీఎంపీఎఫ్ ఖాతాల్లో ఉండే డబ్బుల వివరాలను ఇకమీదట ఈ పోర్టల్(http:// cmpf. gov. in)లో సులువుగా తెలుసుకోవచ్చన్నారు. అనంతరం ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో పలు రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహెరా, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో కూలిన పైకప్పు



కుర్మగూడెం పాఠశాలలో కూలిన పైకప్పు

భీమిని: కన్నెపల్లి మండలంలోని కుర్మగూడెం ప్రాథమిక పాఠశాలలో గురువారం పైకప్పు కూలింది. విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి బయటకు వెళ్లిన సమయంలో కూలడంతో ప్రాణాపాయం తప్పింది. దీంతో ఉపాధ్యాయులు ఆరుబయట చెట్ల కింద విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇప్పటికైనా పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే...

- హత్య కేసు ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, చెప్పులు

తాండూర్(బెల్లంపల్లి): మండలంలో బుధవారం జరిగిన హత్యకేసును 24 గంటలు గడవక ముందే పోలీసులు ఛేదించారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన సిద్దం శ్రీనివాస్ (40) భార్య బానక్కతో తాండూర్‌కు చెందిన మేడి శంకర్ వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయమై దంపతుల మధ్య గొడవలు జరుగుతుండడంతో తమ అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడని, ఎలాగైనా అతన్ని చంపాలని బానక్క ప్రియున్ని పురమాయించింది. పథకం ప్రకారం బురదలో పడి ఉన్న శ్రీనివాస్ తలపై శంకర్ కాలుతో గట్టిగా అదిమిపట్టి హత్య చేశాడు. ఇందుకు బానక్క సహకరించింది. మృతుని తల్లి సిద్దం మొండక్క ఫిర్యాదుతో నిందితులు శంకర్, బానక్కను అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరాన్ని అంగీకరించారు. ఇరువురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 3 సెల్‌ఫోన్లు, ఓ బైక్ , హత్య చేసిన సమయంలో ధరించిన దుస్తులు, చెప్పులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. 24 గంటల వ్యవధిలో కేసును ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్‌ను డీసీపీ, ఏసీపీ అభినందించారు.

వివాహిత దారుణ హత్య

- మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘటన
- భర్తే హత్య చేయించాడని కుటుంబ సభ్యుల ఆరోపణ



భర్త, కూతురుతో శరణ్య (ఫైల్)



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడ రైల్వే ఏ క్యాబిన్ సమీపంలో ఓ మహిళ దారుణహత్యకు గురైన సంఘటన సంచలనం సృష్టించింది. గోపాల్‌వాడకు చెందిన బత్తిని శరణ్య (27) స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తోంది. గురువారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన శరణ్య రైల్వే ట్రాక్ పక్కనే రక్తపుమడుగులో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి సందర్శించారు. పోలీసులు ఘటన స్థలంలో మృతురాలి సెల్‌ఫోన్, గొడుగు, హ్యాండ్‌బ్యాగ్, రక్తపు నమూనాలు, ఫింగర్ ప్రింట్స్ సేకరించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రాజు తెలిపారు.

భర్తే హత్య చేశాడు..

శరణ్యను ఆమె భర్తే హత్య చేశాడని తల్లి లక్ష్మి, సోదరి శ్రావణి ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పన్నెండేళ్ల క్రితం గోపాల్‌వాడకు చెందిన సయ్యద్ జియా ఉల్‌హక్‌ను శరణ్య ప్రేమ వివాహం చేసుకుంది. సయ్యద్ సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దంపతులకు ఒక కూతురు సంతానం. ఆరేళ్ల తర్వాత సయ్యద్ ఉద్యోగం చేస్తున్న ప్రాంతంలో మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. శరణ్య సద్దుపై కేసు పెట్టింది. ఇది కోర్టులో కేసు కొనసాగుతోంది. ఆరేళ్లుగా ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. పదిరోజుల క్రితం సయ్యద్ ఫోన్‌చేసి విడాకులు ఇస్తావా? లేదంటే చంపేస్తానని బెదిరించాడని శరణ్య కుటుంబ సభ్యులతో వాపోయింది. దీంతో భర్తే హత్యచేసి ఉంటాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షురాలిగా చిదానంద కుమారి



నియామకపత్రం అందుకుంటున్న కుమారి

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మంచిర్యాలకు చెందిన చిదానందకుమారిని నియమించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా విభాగం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన గంప వాణిని రాష్ట్ర నిర్వాహక కార్యదర్శిగా, బాల విజయను రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు.

ఇద్దరు యువకులపై దాడి

- ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో గొడవ



గాయపడిన వరప్రసాద్



సాగర్

బెల్లంపల్లి: ఫ్లెక్సీల ఏర్పాటులో జరిగిన గొడవలో ఇద్దరు యువకులపై దాడి చేసిన ఘటన గురువారం రాత్రి బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం...బీఎస్పీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లపల్లి వరప్రసాద్ కన్నాల చౌరస్తాలోని హన్మాన్ విగ్రహం ఎదుట ఉన్న ఫ్లెక్సీ బోర్డుపై పార్టీ ప్రచారం కోసం ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకున్నాడు. నెల రోజుల పాటు ఉండేలా యాడ్ ఏజెన్సీతో ఒప్పందం చేసుకున్నాడు. అయితే అదే ఫ్లెక్సీపై ప్రధాన రాజకీయ పార్టీ అనుబంధ యువజన సంఘం నాయకుడు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో వరప్రసాద్ వచ్చి చించివేశాడు. విషయం తెలుసుకున్న సదరు యువజన సంఘం నాయకుడి అనుచరులు వరప్రసాద్, అతని వెంట ఉన్న రెబ్బెనకు చెందిన జాడి సాగర్‌పై మూకుమ్మడిగా దాడి చేయడంతో ఇరువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకునేలోగానే దాడికి పాల్పడిన యువకులు పారిపోయారు.

మెరుగైన వేతనాలు చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

నస్పూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం కార్యాలయంలో డీజీఎం పర్సనల్ అరవిందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా వేతనాలు చెల్లించాలని, కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే యాక్సిడెంట్ బెనిఫిట్ కింద రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఈఎస్ సౌకర్యం కల్పించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు యాదగిరి, గొట్టె శ్రీనివాస్, శోభ, మల్లేశ్, రాజకళ, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.